సాక్షి కామారెడ్డి

మంగళవారం । 6 । జూన్ । 2023



కోతలు లేకుండా కరెంట్

కోతలు లేని నాణ్యమైన కరెంట్ సరఫరాలో దేశంలోనే తెలంగాణ ప్రథమస్థానంలో ఉందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు.

- 8లో ▸



ఇంతకు రిజిస్ట్రార్ ఎవరు?

తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ ఎవరనే విషయమై ఇప్పట్లో తేలడం కష్టంగా మారింది.

- 8లో ▸



వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతం కావచ్చు.

న్యూస్‌రీల్

బడిబాటను పరిశీలించిన స్టేట్ అబ్జర్వర్



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంతో పాటు కృష్ణాజివాడిలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని సోమవారం స్టేట్ అబ్జర్వర్ రవికాంత్‌రావు పరిశీలించారు. గ్రామంలో తిరుగుతూ బడిఈడు పిల్లల ఇళ్లకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బడిఈడు పిల్లలను తప్పనిసరిగా చదివించాలని సూచించారు. ఈ సందర్భంగా 6వ తరగతిలో ఆరుగురు విద్యార్థులను అడ్మిట్ చేసుకున్నారు. అనంతరం తాడ్వాయిలోని కస్తూర్బా పాఠశాలను పరిశీలించి పలు అంశాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆయన వెంట డీఈవో రాజు, సెక్టోరియల్ ఆఫీసర్ వేణుశర్మ, జీసీడీవో ఉమారాణి, ఎంఈవో రామస్వామి, సర్పంచ్ భూషణం, ఎంపీటీసీ శాంతాబాయి తదితరులున్నారు.

ఆరోగ్యజ్యోతికి జాతీయస్థాయి అవార్డు



బాన్సువాడ: జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్స్ అవార్డు -2023కు బాన్సువాడ మాత శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఆరోగ్యజ్యోతి ఎంపికైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక సంయుక్తంగా మంగళవారం బెంగుళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో ఇంటర్నేషనల్ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బెంగుళూరులో అందుకోనున్నారని తెలిపారు.

ధరణి వేలంను సద్వినియోగం చేసుకోండి



కామారెడ్డి క్రైం: ధరణి టౌన్ షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, వివిధ దశల్లో పూర్తయిన ఇళ్లను ఈ నెల 8వ తేదీ వరకు వేలం పాట ద్వారా విక్రయిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్‌లో ధరణి టౌన్‌షిప్‌లో మిగిలిన ప్లాట్లు, ఇళ్లకు వేలం నిర్వహించారు. ఈనెల 6 నుంచి 8 వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేలంపాట ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సోమవారం మొదటి రోజు మూడుపాట్లను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి రూ. 32.92 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

జాతీయ అవార్డు అందుకున్న పెరుమాండ్లు



బీబీపేట: సమాజ సేవా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ప్రపంచ మానవహక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో భారత గౌరవ శ్రీ సమ్మాన్ కౌన్సిల్ ప్రతినిధులు మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పెరుమాండ్లుకు జాతీయ అవార్డును అందజేశారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో 15 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న సందర్భంగా ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరుమాండ్లును భారత్ గౌరవ్ రత్న అవార్డుతో సత్కరించారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. సోమవారం మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోళ్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతువేదిక భవనంలో నిర్వహించిన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం అభిషేక్‌సింగ్, రైతుబంధు అధ్యక్షుడు బాల్‌రాజు, ఏఎంసీ డైరెక్టర్ సిద్ధి రాములు, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి పర్లేదు..!

- ఎండల్లోనూ తగ్గని పాల ఉత్పత్తి
- విజయ డెయిరీకి రోజూ 14వేల లీటర్లు
- గత ఏడాది కన్నా పెరిగిన ఉత్పత్తి



ఎండల తీవ్రత పెరిగిన కొద్దీ పాల ఉత్పత్తి పడిపోవడం సహజం. ప్రతి ఏడాది వేసవి కాలంలో పాల ఉత్పత్తి పడిపోయేది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి పాలు గతంలో కన్నా ఎక్కువగా వస్తున్నాయి. ఈ సారి ఎండలు మండిపోయినప్పటికీ పాల ఉత్పత్తి తగ్గకపోగా, పెరగడం విశేషం. – సాక్షి, కామారెడ్డి

జిల్లాలో తాడ్వాయి, భిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, కామారెడ్డి, లింగంపేట, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్ తదితర మండలాల నుంచి ఎక్కువ సంఖ్యలో పాలు సేకరిస్తున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడిపై రైతులు శ్రద్ధ చూపుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే ప్రతి రైతు ఇళ్లలో ఒకటి రెండు పాడి పశువులు ఉంటాయి. పాలతో ఇంటి ఖర్చులకు సంపాదించే వారు కొందరైతే, పాలతోనే వ్యవసాయానికి పెట్టుబడులు కూడా సముపార్జిస్తున్నవారూ ఉన్నారు. పాడిని జీవనాధారంగా చేసుకుని బతుకులు వెళ్లదీసేవారు కూడా ఉన్నారు.

పెరిగిన పాల సేకరణ

కామారెడ్డి జిల్లాలో 147 పాల సేకరణ కేంద్రాల్లో దాదాపు ఐదు వేల మంది పాడి రైతులు ఉన్నారు. గతేడాది వేసవి సీజన్‌లో ముఖ్యంగా మే నెలలో రోజూ 9వేల లీటర్లకు మించి పాలు సేకరించే పరిస్థితి లేదని విజయ డెయిరీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ సారి మే నెలలో రోజుకు 14వేల లీటర్లు సేకరిస్తున్నామని చెబుతున్నారు. అంటే గత ఏడాది కన్నా ఐదు వేల లీటర్ల పాలు ఎక్కువగా సేకరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. చాలా మంది రైతులు ప్రభుత్వ డెయిరీ అయిన విజయ డెయిరీవైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రోత్సహిస్తే మరింత పెరిగే అవకాశం..

విజయ డెయిరీ ద్వారా ప్రభుత్వం రైతులను మరింత ప్రోత్సాహం అందిస్తే పాల ఉత్పత్తి, సేకరణ పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు దశాబ్దాల కాలంగా పాడి పశువుల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పాలకోసం ఆవులు, గేదెలను కొనుగోలు చేసి వాటిని పెంచుతున్నారు. వివిధ పథకాల ద్వారా రైతులకు పాడి పశులను ప్రభుత్వం అందిస్తోంది. వాటి పెంపకంతో పాటు, సేకరించిన పాలకు పోత్సాహక ధరలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.





తాడ్వాయిలోని విజయ డెయిరీ పాల కేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

లక్ష్యం 30 వేల లీటర్లు

రైతుల నుంచి 30వేల లీటర్లు సేకరించాలన్నది మా లక్ష్యం. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి చాలా బాగుంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులు ప్రైవేటు కన్నా విజయ డెయిరీకే ఎక్కువ పాలు పోస్తున్నారు. రైతులకు వివిధ పథకాల ద్వారా మరిన్ని పశువులు అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో పాల సేకరణలో లక్ష్యాన్ని చేరుకోగలం.

– ప్రవీణ్, డిప్యూటీ డైరెక్టర్, విజయ డెయిరీ

తెలంగాణలోనే 24 గంటల విద్యుత్



- దేశంలో మరే రాష్ట్రం ఇవ్వడం లేదు
- తొమ్మిదేళ్లలో పెరిగిన తలసరి విద్యుత్ వినియోగం
- గత పదేళ్ల ప్రజాజీవితం నాకు సంతృప్తినిచ్చింది
- విద్యుత్ ప్రగతి సభలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో నిర్వహించిన విద్యుత్ ప్రగతి సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: దేశంలో ఏ రాష్ట్రం కూడా 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని.. కేవలం తెలంగాణలో మాత్రమే అమలవుతోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని సోమేశ్వర్ చౌరస్తా వద్ద ఉన్న ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ ప్రగతి సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 2014లో మన సామర్థ్యం 7,700 మెగావాట్లు ఉంటే 2,700 మెగావాట్లు లోటు ఉండేదని, పాపిష్టి పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రం తర్వాత నీళ్లు, బొగ్గు, గాలి, సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం తెలంగాణ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. 2014 తర్వాత విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల పటిష్టం, విస్తరణకు రూ. 97,321 కోట్లు ఖర్చు చేసిందన్నారు. గతంలో రాష్ట్రంలో 7,700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేదని, ప్రస్తుతం 18,700 మెగావాట్లు ఉత్పత్తి చేసుకుంటున్నామన్నారు. 2014లో తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 1196 యూనిట్లు ఉంటే ఈ రోజు తలసరి విద్యుత్ వినియోగం 2150 యూనిట్లకు చేరిందన్నారు. ల్యాండ్రీ దుకాణాలకు, హెయిర్‌కటింగ్ సెలూన్స్‌కు 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైన రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 28 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటే మరో 50 ఏళ్ల వరకు విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

గత పదేళ్లలో ప్రజాజీవితం నాకు సంతృప్తి ఇచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చానన్నారు. అంతకుముందు విద్యుత్ ప్రగతికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు, ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, ఎంపీపీ నీరజావెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, సోమేశ్వర్ సర్పంచ్ పద్మమొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

బరాబర్ 'ధరణి' తీసేస్తాం

- ధరణితో లాభపడ్డది దొరలు, భూకబ్జాదారులే
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



అడ్లూర్‌లో అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బరాబర్ ధరణిని తీసేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరణితో లాభపడ్డది దొరలు, భూస్వాములు, కబ్జాదారులు మాత్రమేనని ఆరోపించారు. ధరణితో ప్రజలకు లాభం అవుతుందని నిర్మల్ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడడం అబద్ధమన్నారు. ధరణి పోర్టల్ వల్ల ఎందరో రైతులు భూములు తమ పేరుపై రావడం లేదని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సాక్షాత్తు మాజీ మంత్రి అయిన తనకే ధరణి వల్ల అన్యాయం జరిగిందన్నారు. మాచారెడ్డి మండలంలోని తమ వంశపారంపర్యంగా వస్తున్న సర్వే నంబర్ 236లో రెండు ఎకరాల 36 గుంటల భూమి గల్లంతైందని తెలిపారు. రెండేళ్ల నుంచి మొరపెట్టుకుంటే ఇప్పటికీ ఒక ఎకరం 14 గుంటలు మాత్రమే రికార్డుల్లోకి ఎక్కిందన్నారు. తనకే ఇలా జరిగితే సామాన్య ప్రజలు ఎంత ఇబ్బందులు గురవుతున్నారో అర్థమవుతుందన్నారు. బీఆర్ఎస్‌ను ఈ సారి ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారంగుల అశోక్‌రెడ్డి, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మెతో ప'రేషన్'

- గోదాముల్లోనే బియ్యం నిల్వలు
- తెరుచుకోని రేషన్ దుకాణాలు
- వినియోగదారులకు ఇబ్బందులు



తాళాలు తెరువని రేషన్ దుకాణం

నిజాంసాగర్(జుక్కల్):సమస్యల పరిష్కారం కోసం రేషన్ డీలర్లు సమ్మెబాట పట్టడంతో వినియోగదారులు పరేషాన్ అవుతున్నారు. ప్రతినెలా మొదటి వారం నుంచి మూడో వారం వరకు డీలర్లు రేషన్ బియ్యాన్ని వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. డీలర్లు సమ్మెకు దిగడంతో సివిల్‌సప్లయ్ గోదాముల్లోనే ఉన్నాయి. గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా కాలేదు. అంతేకాకుండా దుకాణాలకు డీలర్లు తాళాలు వేయడంతో మూతపడ్డాయి. దీంతో బియ్యం కోసం రేషన్ దుకాణాలకు వచ్చిన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో 578 షాపులు

జిల్లాలో 2,34,323 ఆహార భద్రత, 17,504 అంత్యోదయ, 931 అన్నపూర్ణ కార్డులు రేషన్ కార్డులు ఉన్నాయి. జిల్లాలో 578 రేషన్ దుకాణాలు ఉండగా 502 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. 76 దుకాణాలకు ఇన్‌చార్జి డీలర్లు ఉన్నారు. ఆయా రేషన్ దుకాణాల ద్వారా 86,04,656 యూనిట్లు ఉన్నాయి. కాగా రేషన్ డీలర్లు తమ సమస్యలను పరిష్కారం కోసం సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో రేషన్ దుకాణాలు తెరుచుకోలేదు. ప్రతినెలా మొదటి వారం నుంచి రేషన్ దుకాణాల ద్వారా బియ్య సరఫరా చేస్తారు. కానీ ఈ నెల 3 నుంచి డీలర్లు సమ్మెబాట పట్టడంతో దుకాణాలను డీలర్లు తెరవడం లేదు. దాంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వచ్చి వెనుదిరిగి వెళ్తున్నారు.

డిమాండ్లను నెరవేర్చేవరకు..



తమ న్యాయమైన నెరవేర్చే వరకు డీలర్లమంతా ఐక్యమత్యంగా సమ్మె చేస్తున్నాం. ఈ నెల 3వ తేదీ నుంచి సమ్మెకు దిగి దుకాణాలకు తాళాలు వేశాం. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదు.

– గౌరిశెట్టి రాజు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కామారెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జ్యుడీషియల్ సిబ్బంది

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి

కామారెడ్డి క్రైం: పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్. శ్రీదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

దేవునిపల్లి చౌరస్తా నుంచి కోర్టు కాంప్లెక్స్ వరకు పాదయాత్ర చేపట్టారు. ప్లకార్డుల ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛమైన పర్యావరణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు భాగస్వామ్యం, సహకారం అందించాలన్నారు. బాధ్యతగా మొక్కలు నాటడం, వాహనాల వాడకాన్ని తగ్గించడం, ప్లాస్టిక్‌ను నిర్మూలించడం లాంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాటితోనే జీవకోటి మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్ గౌడ్, దామోదర్ రెడ్డి, అశోక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్, అధికారులు శ్రీదేవి, యాదగిరి, న్యాయవాదులు నరసింహారెడ్డి, జగన్నాథం, అమృతరావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డిటౌన్: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో ఖేల్ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి షటిల్ బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ ముగింపు సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్రీడలతో క్రమశిక్షణ పెరుగుతుందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని చెప్పారు. జిల్లాస్థాయి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అకాడమీ డైరెక్టర్ సందీప్ గౌడ్, సీనియర్ క్రీడాకారుడు ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేస్తున్న కలెక్టర్

ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలి



లింగంపేట పెద్దమ్మ ఆలయంలో పూజలు చేసిన ఈటల రాజేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేటలోని పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. చేపల చెరువుల్లో ముదిరాజ్‌లకు బాగస్వామ్యం ఉండే విధంగా జీవో విడుదల చేయడానికి శాసన సభలో పోరాడుతున్నట్లు తెలిపారు. అనంతరం బీజేపీ ముఖ్య నాయకులతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, నాయకులు బొల్లారం క్రాంతికుమార్, కాశీరాం, రాజు, గణేశ్, శెట్పల్లి కాశీరాం తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి మండలంలోని మీసానిపల్లిలో కొనసాగుతున్న ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి, సామెల్, దేవేందర్, బాలకిషన్, విద్యాసాగర్, ప్రశాంత్‌గౌడ్, బైండ్ల పోచయ్య, పైల కృష్ణారెడ్డి, బోండ్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి



సుభాష్‌నగర్: ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 101 వినతులు అందాయి. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో చందర్‌నాయక్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు.

భూమి కబ్జా చేసిన ఏఆర్ ఏఎస్సైపై ఏసీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరానికి చెందిన ఏఆర్ ఏఎస్సై షకీల్‌తోపాటు ఇంతియాజ్, శ్రీనివాస్ తమ భూమి కబ్జా చేశారని, అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని నగరంలోని కోజా కాలనీకి చెందిన మహ్మద్ రహిమొద్దీన్, అతని సోదరుడు నయీం తెలిపారు. వారు మాట్లాడుతూ.. మాక్లూర్ మండలంలోని సింగంపల్లి శివారులో 53 సర్వే నంబర్‌లో 25.24 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ సర్వే నంబర్‌లోని భూమి కరక్షన్ కోసం హైకోర్టులో కేసు పెండింగ్ ఉందని తెలిపారు. ఈ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు, యాజమాన్యహక్కులు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఇందులోని 5.34 ఎకరాల భూమిని షకీల్, ఇంతియాజ్, శ్రీనివాస్ కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమి తమదంటే ఏఆర్ ఏఎస్సై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీరిపై మే 25న ఏసీపీ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

గ్రామ సమాఖ్య భవనంలోకి చొరబాటు

- రికార్డులు చింపివేసిన దుండగులు



సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామ సమాఖ్య భవనంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రికార్డులను, కాగితాలను చిందరవందర చేసి నానా హంగామా సృష్టించారు. బీరువా తాళం పగులగొట్టి రికార్డులను చింపివేశారు. ఈ భవనంలో రెండు గ్రామాలకు సంబంధించిన రికార్డులను భద్రపరుస్తున్నట్లు ఐకేపీ అధికారులు పేర్కొంటున్నారు. ఘటనా స్థలాన్ని ఏపీడీ మురళి సంర్శించారు. ఈ విషయమై గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల, సరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మేకల మందపై చిరుత దాడి



పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి శివారులో మేకపిల్లపై చిరుత దాడి చేసింది. మేకల యజమాని బాగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాటేపల్లి శివారులోని సోమవారం సాయంత్రం మేకల మందపై చిరుత దాడి చేసింది. ముగ్గురు కాపరులు, కుక్కలతో కలిసి పులి వెంటపడడంతో పారిపోయిందని ఆయన తెలిపారు. ఈ దాడిలో ఒక మేక పిల్ల, ఒక కుక్కకు గాయాలయ్యాయని చెప్పారు.

ఇంతకు రిజిస్ట్రార్ ఎవరు?

- ఈసీ కాదన్నా విధుల్లో ప్రొఫెసర్ కనకయ్య
- వర్సిటీలో కొనసాగుతున్న గందరగోళం



ఫైళ్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్య

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎవరనే విషయమై ఇప్పట్లో తేలడం కష్టంగా మారింది. వీసీ ఒక తోవ, ఈసీ మరో తోవ ఇలా ఎవరి దారి వారిదే అనే మొండి పట్టుదలకు పోయి వర్సిటీ అభివృద్ధిని గాలికొదిలేశారు. 2023 ఏప్రిల్ 19న ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా ఈసీ నియమించడంతో మొదలైన ఈ వివాదం నెలన్నరదాటినా ఒక కొలిక్కి రాక గందరగోళం కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీ పరువు, ప్రతిష్టలు మంటగలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

తమకే అధికారం అంటున్న ఈసీ, వీసీ

రిజిస్ట్రార్ నియామకం అధికారం నాకే ఉంటుందని వీసీ డి రవీందర్ చెబుతుంటే.. పాలకమండలి (ఈసీ)కే అధికారం ఉంటుందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చెబుతోంది. ఈసీ చైర్మన్‌గా వ్యవహరించే వీసీ రవీందర్ గైర్హాజరవుతున్నా.. వారానికి ఒకటి చొప్పున ఈసీ సమావేశాలు నిర్వహిస్తూ పలు తీర్మానాలు చేస్తున్నారు. అయితే వాటిని అమలు చేయాల్సిన వీసీ తెయూ 55వ ఈసీ సమావేశం తీర్మానాలు అమలు రద్దుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సాకుగా చూపుతున్నారు. ఈసీ నిర్ణయాన్ని కాదని మే 3న ఇంచార్జీ రిజిస్ట్రార్‌గా ఓయూ కు చెందిన ప్రొఫెసర్ నిర్మలాదేవిని వీసీ రవీందర్ నియమించగా ఆమె వెంటనే బాధ్యతలు స్వీకరించారు. తర్వాత జరిగిన పరిణామాలతో కేవలం ఐదు రోజుల్లోనే నిర్మలాదేవి తిరిగి ఓయూకు వెళ్లిపోయారు. నిర్మలాదేవి ఉదంతం తర్వాత మళ్లీ రిజిస్ట్రార్‌గా యాదగిరి విధుల్లో చేరారు. రిజిస్ట్రార్ యాదగిరి జారీ చేసే చెక్కులను ఆమోదించాలని కోరుతూ వీసీ రవీందర్ బ్యాంకు అధికారులను కోరడంతో పాటు సంతకం చేశారు. దీంతో గత నెల అధ్యాపకులు, సిబ్బంది వేతనాలు చెల్లించారు. అయితే మే 15న వీసీ ఆదేశాల మేరకు సిబ్బంది రిజిస్ట్రార్ కార్యాలయం తాళం తెరవలేదు. ఈసీ తీర్మానం చేసినా ఆర్డర్స్ లేకపోవడంతో రిజిస్ట్రార్‌గా యాదగిరి నియామకం చెల్లదని వీసీ పేర్కొన్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం వెలువరించే వరకు తాను రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోనని యాదగిరి ఛాంబర్‌కు రాకుండా తన విభాగానికే పరిమితమయ్యారు. దీంతో మళ్లీ వర్సిటీకి రిజిస్ట్రార్ లేకుండా పోయారు. మే 26న ప్రొఫెసర్ కనకయ్యను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వీసీ నియమించారు.

ఇద్దరి మధ్య వాగ్వాదం

యూనివర్సిటీ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రార్‌ను నియమించే అధికారం వీసీకి లేదని, ఈసీకి మాత్రమే ఉంటుందని స్పష్టం చేస్తూ మే 27న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి పేరుతో తెయూకు లేఖ పంపించారు. దీంతో యాదగిరి మళ్లీ రిజిస్ట్రార్ కార్యాయానికి వచ్చి విధులు చేపట్టారు. కొద్దిసేపటికి అక్కడికి వచ్చిన కనకయ్య తనకు వీసీ ఇచ్చిన ఆర్డర్స్ ఉన్నాయని రిజిస్ట్రార్‌గా తనకే అధికారం ఉంటుందని పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ ద్వారా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే తాను రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు యాదగిరి బదులిచ్చారు. రిజిస్ట్రార్ కుర్చీ నాదంటే నాదని ఇరువురి మధ్య వాగ్వాదం నెలకొంది. అక్కడికి వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, దళిత సంఘాల నాయకులు వర్గాలుగా విడిపోయి కొందరు యాదగిరికి, మరికొందరు కనకయ్యకు మద్దతు తెలుపడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చివరకు అసలైన రిజిస్ట్రార్ ఎవరో తేలేవరకు రిజిస్ట్రార్ కుర్చీలో ఎవరూ కూర్చోకూడదని అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తీర్మానించారు. దీంతో యాదగిరి, కనకయ్య ఇరువురూ ఛాంబర్ నుంచి బయటకు వెళ్లిపోయారు. అయితే ఈ నెల 3న జరిగిన ఈసీ సమావేశంలో కనకయ్య నియామకం నిబంధనలకు విరుద్ధమని, రిజిస్ట్రార్‌గా యాదగిరి కొనసాగుతారని మరోసారి తీర్మానించారు. వీసీ రవీందర్‌పై ప్రభుత్వం పదిరోజుల్లో చర్యలు తీసుకుంటుందని అప్పటి వరకు ఓపిక పట్టాలని ఈసీ సభ్యులకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ, కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్ స్పష్టం చేశారు. ఈసీ కాదన్నప్పటికీ సోమవారం కనకయ్య యథావిధిగా రిజిస్ట్రార్ ఛాంబర్‌కు వచ్చి విధులు నిర్వహించారు. దీంతో తాము ఎవరి మాట వినాలో తెలియక అధ్యాపకులు, సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయమై ప్రొఫెసర్ యాదగిరిని సాక్షి ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

“ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదనే..

రిజిస్ట్రార్ కుర్చీ ఖాళీగా ఉండటంతో రోజువారీ కార్యకలాపాలు స్తంభించి ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీసీ రవీందర్ పట్టుబట్టి ఆర్డర్స్ ఇస్తేనే నేను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించాను. వీసీ, ఈసీ పోరాటంలో ఉద్యోగులు ఎందుకు బాధపడాలి. వారు ఇబ్బందులు పడకూడదనే రోజువారీ సాధారణ కార్యకలాపాలు, వేతనాలు చెల్లింపులకు మాత్రమే నా విధి నిర్వహణ పరిమితం చేసుకున్నాను. ఇతర ఏ రకమైన చెల్లింపుల జోలికి వెళ్లడం లేదు.

– కనకయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్

మొక్కలను సంరక్షించాలి

మానవులకు మొక్కలతో సంబంధాలు



మొక్క నాటి నీరు పోస్తున్న జిల్లా జడ్జి సునీత

ఖలీల్‌వాడి: మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. న్యాయసేవ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాకోర్టు ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. చెట్లను దేవుళ్లుగా కొలిచే ఆధ్యాత్మిక సంస్కృతి భారతీయుల జీవనవిధానంలో అంతర్భాగమన్నారు. వానాకాలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. అదనపు జిల్లా జడ్జిలు కనకదుర్గ, శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ ఉపాధ్యాయ, గోపికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, పురుషోత్తంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ర్యాలీ

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల భవన్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా జడ్జి సునీత కుంచాల ప్రసంగించారు.

సెర్ప్‌లో అక్రమ వసూళ్ల జోరు!

- గ్రామ సమాఖ్యల ఆర్థిక లావాదేవీల్లో లోపాలు ఎత్తి చూపుతూ..
- వీవోఏల నుంచి దండుకుంటున్న కొందరు ఉద్యోగులు
- ఒక్కో సమాఖ్య నుంచి రూ.40వేల వరకు వసూలు

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలోని ఒక గ్రామ సమాఖ్య సొంత నిధుల నుంచి అప్పుగా తీసుకున్న రూ.రెండు లక్షలకు ఆడిటింగ్‌లో అభ్యంతరం చెప్పకుండా ఉండటానికి వీవోఏగా పని చేస్తున్న మహిళ నుంచి ఉద్యోగి ఒకరు రూ.1.05లక్షలు వసూలు చేశాడు. మోర్తాడ్‌లోని ఒక సమాఖ్య వీవోఏ లెక్కలు సరిగా రాయలేదని వీటిని సరి చేయడానికి అదే ఉద్యోగి రూ.40వేలు తీసుకున్నాడు. ఇది ఒక్క మోర్తాడ్ మండలంలోనే చోటు చేసుకున్న వసూళ్ల దందా కాదు. అనేక మండలాల్లో గ్రామ సమాఖ్యల వీవోఏల నుంచి ఆడిటింగ్‌లో అభ్యంతరాలు చెప్పకుండా ఉండటానికి కొందరు సెర్ప్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. గ్రామ సమాఖ్యలకు అసిస్టెంట్(వీవోఏ)లుగా పని చేస్తున్న వారిలో అనేక మంది సెర్ప్ ఉద్యోగుల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాల పంపిణీ, వసూళ్ల వ్యవహారం అంతా వీవోఏలే చూస్తున్నారు. సంఘాల ఆర్థిక లావాదేవిలను రికార్డులలో రాయడం, ఇతరత్రా వ్యవహారాలను వీవోఏలు చక్కదిద్దుతుండటం, సెర్ప్ ఉద్యోగులకు గ్రామ సమాఖ్యలకు వీరు వారధిగా వ్యవహరిస్తున్నారు. వీవోఏలకు వేతనం తక్కువే ఉన్నా ఆర్థిక వ్యవహారాలు భారీ మొత్తంలో కొనసాగుతుండటం గమనార్హం. వీవోఏలను అవినీతి ఉద్యోగులు వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఇంటర్నల్ ఆడిటింగ్‌తో పాటు చార్టెడ్ అకౌంటెంట్లతోను ఆడిటింగ్‌ను నిర్వహిస్తారు. వీవోఏలు ఒక చిన్న పొరపాటు చేసినా దానిని ఆసరాగా చేసుకుని ఉద్యోగులు ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులు నేరుగా డబ్బు తీసుకోకుండా ఫోన్‌పే, గూగుల్‌పే లాంటి యూపీఐ సర్వీసులను వినియోగించుకోవడం విశేషం. సెర్ప్ ఉన్నతాధికారులు స్పందించి వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రంలో కోతలు లేకుండా కరెంట్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డిఅర్బన్: కోతలు లేని నాణ్యమైన కరెంట్ సరఫరాలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానం పొందిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నియోజకవర్గ విద్యుత్ ప్రగతి సమావేశం దేవునిపల్లి లక్ష్మీదేవి గార్డెన్‌లో జరిగింది. డీఈ సాలియా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోవర్ధన్ విద్యుత్ బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెక్‌లను అందజేశారు. నియోజకవర్గంలో చేపట్టిన విద్యుత్ పనులను వివరించారు. 210 మెగావాట్ల సోలార్‌పవర్ స్టేషన్లు ఏర్పాటు అయ్యాయన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జహ్నవి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీలు ఆంజనేయులు, నర్సింగరావు, బాలమణి, దశరథ్‌రెడ్డి, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సీడీసీ చైర్మన్ నర్సయ్య పాల్గొన్నారు.

ఆలస్యంగా వచ్చిన విప్

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమావేశానికి ఉదయం 10గంటలకు రావాల్సి ఉండగా 11:30 గంటలకు వస్తున్నట్టు తొలుత ప్రకటించారు. ఈ మేరకు అందరికి సమాచారం ఇచ్చారు. స్థానికంగా ఉన్నప్పటికీ ఎంతకూ రాకపోవడంతో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు హైరానా పడ్డారు. తీవ్రమైన ఎండ ఉండడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కలెక్టర్, అనంతరం ప్రభుత్వ విప్ రావడంతో హడావుడిగా సమావేశం కానిచ్చారు. రైతులెవరు సమావేశానికి రాలేదు.

బాలికపై అత్యాచారం

డిచ్‌పల్లి: మండలంలోని ఓ గ్రామంలో 9 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నిందితుడు మాయమాటలతో బాలికను సమీపంలోని పొదలవద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో అటుగా వచ్చిన గ్రామస్తులు చూసి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. డిచ్‌పల్లి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మృతి



భూమయ్య(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి టోల్‌ప్లాజాలో దినసరి కూలీ పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో ఇంటికి వెళ్తుండగా ఫిబ్రవరి 8న జరిగిన ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన ఘన్‌పూర్ భూమయ్య ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా బుద్ధులు చెప్పిన గురువులు వెంకటేశం, గాల్‌రెడ్డిని సన్మానించారు.

ఆరీఫ్‌ది ప్రతీకార హత్యే!

- వివరాలు వెల్లడించిన బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్‌రూరల్: ఇబ్రహీం చావుస్ హత్యకు ప్రతీకారంగానే నిజామాబాద్ నగరానికి చెందిన రౌడీ షీటర్ సయ్యద్ ఆరీఫ్ (డాన్ ఆరీఫ్)ను హత్య చేశారని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ వెల్లడించారు. రౌడీషీటర్ సయ్యద్ ఆరీఫ్ (26) హత్య కేసును పోలీసులు ఛేదించారు. సోమవారం బోధన్ రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న ఎడపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద జరిగిన ఆరీఫ్ హత్య కేసులో తొమ్మిది నిందితులను గుర్తించామన్నారు. ఆరీఫ్ తన స్నేహితుడు షేక్ ఖాదర్‌తో కలిసి బోధన్ కోర్టు నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా ఇమ్రాన్, సోహెల్ లారీతో ఢీకొన్నారు. దీంతో వారు కింద పడిపోగా వెనక కారులో వస్తున్న షేక్ సమదుద్దీన్, షేక్ ఇర్ఫాన్, షేక్ రిజ్వాన్ కత్తులు, జాంబియాలతో ఆరీఫ్‌పై దాడి చేశారు. దీంతో ఆరీఫ్ మృతి చెందగా, ఖాదర్‌కు గాయాలయ్యాయి. ఖాదర్ ఫిర్యాదు మేరకు బోధన్, ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. హత్యకు ఉపయోగించిన లారీని నిందితులు సోమవారం ఉదయం తీసుకెళ్లేందుకు ప్రణాళిక వేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు పక్కా వ్యూహంతో పట్టుకున్నారు. వారిని విచారించి ఈ కేసులో 9మంది నిందితులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఆరుగురు షేక్ సమదుద్దీన్, షేక్ ఇర్ఫాన్, షేక్ రిజ్వాన్, సయ్యద్ అతీక్, షేక్ కరీం, షేక్ సోహైల్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన లారీ, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు నిందితులు మహ్మద్ బేగ్, సయ్యద్ సోహైల్, ఇమ్రాన్ పరారీలో ఉన్నారని ఏసీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజు, ఎడపల్లి ఎస్సై పాండే రావ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి



సుదర్శన్ (ఫైల్)

మోపాల్: మండలకేంద్రానికి చెందిన ఇందూరి సుదర్శన్ (43) అదే గ్రామ చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుదర్శన్ గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత కాలకృత్యాలకు అని ఊర చెరువుకి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఊర చెరువులో మృతదేహం తేలింది. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో ఒకరు..



మల్లయ్య (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): పిడుగుపాటుతో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన మల్లయ్య(48) మృతి చెందాడు. ఆదివారం రాత్రి తన పొలం వద్ద చెట్టుకింద నిలబడి ఉండగా పిడుగుపడింది. అక్కడికక్కడే మల్లయ్య మరణించాడు. సోమవారం అంత్యక్రియలను నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ఆర్మూర్‌టౌన్/ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని దోబీఘాట్ శివారులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న ఒకరు దోబీఘాట్ మూలమలుపు వద్ద సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి క్షతగాత్రులను గమనించి పరామర్శించారు. అంబులెన్స్‌లో వారిని ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యాధికారులకు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఒకరి అదృశ్యం



యాదయ్య

లింగంపేట: మండలంలోని కోమట్‌పల్లి గ్రామానికి చెందిన ధరణి యాదయ్య(45) అదృశ్యమైనట్లు ఎస్సై శంకర్ తెలిపారు. యాదయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు మల్లేశ్ భార్య నాగమణి ఇద్దరు గొడవపడడంతో నాగమణి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. తన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చింది. దాంతో మల్లేశ్, నాగమణికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 12న పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుంటామని ఒప్పుకొని తిరిగి వచ్చారు. ఈ నెల 4న దుర్గమ్మ పండుగ చేసుకుందామని కుటుంబ సభ్యులు అనుకున్నారు. ఈ క్రమంలో యాదయ్య భార్య నిర్మల పెద్దకొడుకు సంసారం బాగు చేయడం లేదు కానీ పండుగ చేసుకుందామా అన్నది. ఈ క్రమంలో ఇరువురు మాటా మాటా అనుకున్నారు. దాంతో యాదయ్య మనస్తాపానికి గురై శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కనిపించకుండా పోయి.. శవమై తేలాడు



ఈర్గల అర్జున్(ఫైల్)

మోర్తాడ్: పదిహేను రోజుల నుంచి కనిపించకుండా పోయిన వ్యక్తి చివరకు మృత్యువాత పడిన ఘటన ఏర్గట్ల మండలం తొర్తిలో చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా పని చేసే ఈర్గల అర్జున్(35) సుమారు పదిహేను రోజుల కింద ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆర్థిక సమస్యలతో అర్జున్ మానసికంగా కృంగిపోయి ఎటో వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం తొర్తి శివారులోని పెద్దవాగు చెక్ డ్యాంలో అర్జున్ మృతదేహం బయటపడింది. ఇంటి నుంచి వెళ్లిన రోజునే వాగులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చోరీ కేసులో జైలు శిక్ష

నాగిరెడ్డిపేట: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన మంగలి సుజాత ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించిన నమోదైన కేసులో నిందితుడికి సోమవారం 8నెలల జైలుశిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఎల్లారెడ్డి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ హారిక తీర్పునిచ్చారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు.. బొల్లారం గ్రామానికి చెందిన మంగలి గౌరీశంకర్ గతేడాది అక్టోబర్‌లో అదేగ్రామానికి చెందిన మంగలి సుజాత ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. పోలీసులు గౌరీశంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గౌరీశంకర్ చేసిన నేరం రుజువైనందున ఎనిమిది నెలల జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరయ్య, విచారణ అధికారి ఎస్సై ఆంజనేయులు, లైజన్ అధికారి హన్మాండ్లు, కోర్టు కానిస్టేబుల్ వినోద్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

మూట కోసం వెనక్కి వెళ్లి మృత్యువాత



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

జక్రాన్‌పల్లి: ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయిన మూట కోసం రాంగ్‌రూట్‌లో వెతుక్కుంటూ వెళ్తుండగా కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని అర్గుల్ శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రన్న(47)కు భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నారు. ఎర్రన్న ఖాళీ సీసాలు ఏరుకొని జీవనం సాగిస్తాడు. నెల రోజుల నుంచి ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లిలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఎర్రన్న తన భార్య లక్ష్మితో కలిసి మోటర్ సైకిల్‌పై అర్గుల్‌కు పని కోసం వస్తుండగా వాహనం వెనుకాల ఉన్న మూట కిందపడిపోయింది. దీంతో భార్య లక్ష్మిని వెంకటేశ్వర కాలనీ వద్ద ఉంచి మూటను వెతుక్కుంటూ ఆర్మూర్ వైపు రాంగ్ రూట్‌లో వెళ్లాడు. ఈ క్రమంలో ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తున్న కారు ఆయనను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలై ఎర్రన్న అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సైబర్ నేరగాళ్ల టోకరా

లింగంపేట: మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.88 వేలు పోగొట్టుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. సదరు వ్యక్తికి గత 21న పార్ట్ టైం ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాట్సాప్ మేసేజ్ వచ్చింది. ఉద్యోగంలో చేరుటకు రెండు, మూడు టాస్క్‌లు, సమీక్షలు ఉంటాయని సూచించారు. సమీక్షల్లో పాల్గొని కొంత సమాచారం రాయడానికి రూ.50 ఖాతాకు పంపుతామని చెప్పడంతో బాధితుడు బ్యాంకు ఖాతా నంబరు, వివరాలు ఇచ్చాడు. రెండో సారి రూ. 100 పంపారు. ఎక్కువ డబ్బులు కావాలంటే మరి కొంత డబ్బులు డిపాజిట్ చేయాలని సూచించారు. దీంతో మొదట బాధితుడు నిరాకరించగా అతని ఖాతాలో మరిన్ని డబ్బులు జమ చేశారు. దీంతో నమ్మకం కుదిరిన అతను పలు విడుతల్లో సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాల్లో డబ్బులు జమ చేశాడు. మొదట అతను వేసిన దానికంటే ఎక్కువ డబ్బులు పంపి నమ్మేలా చేసిన నిందితులు తర్వాత మోసం చేశారు. ఇలా మొత్తం రూ.88 వేలు సైబర్ నేరగాళ్లకు పంపిన బాధితుడు వారి తిరిగి ఇవ్వకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.